# సినేమా సూటింగోళ్లొచ్చేరు

ఊళ్ళో సినిమా షూటింగ్ జరగబోతుంది.

తాడి గన్నెడ్డిని చక్రాలూ అని పిలుస్తారంతా. సినిమాల్తోనూ సినేమావాళ్ళతోనూ సంబంధం వుందతనికి. మామిడాడలో వుండే వాళ్ళ బామ్మర్దులతో నేరం నాదికాదు అనే సినిమా తీయించాడు. ఆ తర్వాత ముగ్గురత్తల ముద్దులఅల్లుడు సినిమా కూడా తీశాడు. అప్పుడప్పుడూ మద్రాసూ, హైదరాబాదూ వెళ్ళి అక్కడిసినిమా కబుర్లు వూళ్ళోకి మోసుకొస్తుంటాడు.

ఇప్పుడు సినిమా వాళ్ళు వూళ్ళోకి రావడానికి కారణం ఈ చక్రాలే. ఆ ప్రొడక్షను వాళ్ళతో మాది బ్యూటీఫుల్ విలేజండి. వచ్చి షూటింగ్ చేసుకోండి. సర్పంచ్ నా ఫ్రెండు, మేం బోల్డు కోపరేషను చేస్తాం అనేసరికి ఎక్కడో దిగాల్సిన వాళ్ళంతా మా ఊళ్ళో దిగిపోయేరు.

ప్రొడక్షను మేనేజరు మాణిక్‌రావు "హీరోయిన్ స్వయంప్రభకి మంచి ఇంట్లో ఎకామిడేషన్ ఇవ్వాలి ఎక్కడా?" అన్నాడు.

"హీరోయిన్‌గార్ని నర్సిరెడ్డిగారి మండువాలోగిట్లో పెడదాం- నే మాటాడాను గందా" అని చక్రాలు అనేసరికి సరే అని అతన్ని ఫాలో అయిపోయాడు ఆ ప్రొడక్షన్ మేనేజర్.

నర్సిరెడ్డిని కల్సిన చక్రాలు మాణిక్‌రావుని పరిచయం చేసి "మీరీ పిల్లలకి పాఠాలు చెప్పడంలో పడి సినిమాలు చూడటం మానేశారు. చాలా గొప్ప యాక్టరు స్వయంప్రభగారు కె. బాలచందర్‌తో మేం తీస్తున్న సినిమాలోకూడా ఆవిడే హీరోయిను" అన్నాడు.

"ఇదంతా నాకెందుకు చెప్తున్నట్టు?" అన్నాడు నర్సిరెడ్డి.

"ఆవిడ స్టార్ హోటల్లో తప్పా దిగదు. ఏ కాకినాడ హోటల్లోనో పెడితే ఆవిడ రావడానికి చాలా ఇబ్బంది అయిపోద్ది. వీళ్ళ షూటింగ్ లేటుగా మొదలవుద్ది. అందుకని మన ఇంట్లో ఏదన్నా గది ఇస్తే బాగుంటుందని వచ్చాం" అన్నాడు చక్రాలు.





కాస్సేపు ఆలోచించిన నర్సిరెడ్డి ''మా రవణని అడిగి చెప్తాను మధ్యాన్నం రండి'' అన్నాడు.

తమ్ముళ్ళిద్దర్నీ వాళ్ళ భార్యల్నీ, తెలుకుల రవణని పిల్చి ''జరిగింది చెప్పి ఏం చేద్దాం?'' అన్నాడు.

బాగా ఆలోచించిన రవణ ''పోన్లే ఆడకూతురు'' అంది.

తమ్ముళ్ళ భార్యలూ అదే అన్నారు.

సరే అని విశాలమైన తన గది ఇవ్వడానికి నిర్ణయించుకున్నాడు నర్సిరెడ్డి.

ఊరి చివర్నున్న నర్సిరెడ్డిగారి ఇంట్లోకి స్వయంప్రభ దిగిపోయింది.

మొదటినాలుగు రోజులూ ఆమెని చూడ్డానికి వచ్చిన జనంతో నిండిపోయిన ఇల్లంతా తొడతొక్కిడిగా తయారైంది. ఆ తర్వాత తర్వాత పల్చబడి పోయేరు జనం.

* * *

నెల్లూరు నాగమణిగారబ్బాయి బాబి నల్లమిల్లి రాజారెడ్డిగారి పొలం గట్ల మీద కందికాయలు కోసుకొచ్చి వీర్రెడ్డిగారి పిల్లలకిస్తే ఆ సాయంత్రం వాళ్ళ దొడ్లో తంపటేయడం మొదలెట్టారు.

పరుగెట్టుకుంటూ లోపల్నుంచొచ్చిన స్వయంప్రభ ఆ పిల్లల్లో పిల్లయిపోయి వాళ్ళతో దెబ్బలాట పెట్టేసుకుని కాలిన తంపటికాయలు చీరచెంగులో వేసుకు పరుగెడ్తుంటే ఆ అరుపులకి లోపల్నుంచొచ్చేరు ఇంట్లో వాళ్ళంతా.

దొడ్లో జరుగుతున్న ఆ గొడవ చూసి విప్పిన నోరు తెరవకండా ఉండిపోయరు.

స్వయంప్రభ అల్లరి చూసిన లచ్చారెడ్డికి చిన్నప్పుడు చనిపోయిన వాళ్ళ చెల్లెలు రామలక్ష్మి గుర్తుకొచ్చింది.

ఆ మర్నాడు, పుంతరేవులో పిల్లలు ఈతలు కొడ్తున్నారు. ఆ గోదావరి కాలవలోంచొస్తున్న గూటి పడవలో ఆడామగా అందంగా సరసాలాడుకుంటున్నారు. కాస్తదూరంగా ఉన్న చింతావారితోట పక్కన నరికేసిన చెరుకుతోటలో తుక్కు మంటపెట్టడంతో ఆ ఉడుకుగాలి ఈ పక్క కొస్తంది. దొడ్లో అల్లనేరేడు చెట్టుకీ, ఆకుసంపెంగ చెట్టుకీ మధ్యనున్న గడ్డిమేటు దగ్గర మేస్తున్న పుంజుని పట్టుకోడానికి నానాయాతనా పడ్తుంది లచ్చారెడ్డిభార్య విజయలక్ష్మి. నానాతిప్పలూ పెడ్తున్న ఆకోడి దొరకటం లేదు. ఆ పుంజుని కోసి కూరొండి సత్తెమ్మతల్లికి నైవేద్యం పెట్టాలి. నానాతిప్పలూ పెడ్తున్న పుంజు గడ్డిమేటెక్కి అక్కడ్నించి ఎగురుకుంటా నేరేడు చెట్టుకొమ్మెక్కి బొక్కు బొక్కు మంటా అరుస్తుంది. ఈలోగా దొడ్లోకి జేరిపోయిన గవర్రెడ్డిభార్య సూరేకాంతం వాళ్ల పిల్లలూ ఆ పుంజుని పట్టుకోడానికి నానాతంటాలూ పడ్తున్నారు.

ఇంతలో, లోపల్నుంచి వచ్చేసిన స్వయంప్రభ గబగబా చెట్టు కొమ్మెక్కేసింది.

ఆ కొమ్మమీంచి దొడ్డి గోడమీదికి దూకిన పుంజు ఆ గోడ మీంచి వెనకున్న పిల్లిపెసర చేలోకి పరుగెట్టింది. పట్టుదల పెరిగిన స్వయంప్రభకూడా గోడమీంచి చేలోకి దూకేస్తుంటే ఇంటిల్లపాదీ సినేమాలాగ చూస్తున్నారు.

మొత్తానికెలాగో ఆ పుంజుని పట్టేసుకుని విజయలక్ష్మి కిస్తుంటే ఆమెకి చనిపోయిన వాళ్ళ ఆడపడుచు రామలక్ష్మి గుర్తొచ్చి అదేముక్క సూరేకాంతంతో అంటే కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకున్న ఆమె "అవును చెల్లీ నాక్కూడా రామలక్ష్మి వదినే గుర్తుకొస్తుంది" అంది.

అటు పక్క నర్సిరెడ్డికీ, గవర్రెడ్డికీ, లక్ష్మారెడ్డికీ కూడా చెల్లెలు రామలక్ష్మి గుర్తుకొచ్చేసరికి ఆ మగాళ్ళుకూడా కళ్ళమ్మట నీళ్ళు పెట్టేసుకున్నారు. సాయంత్రం వచ్చిన రవణకి చెపితే "ఈ పిల్లనిచూసి ఎప్పుడో అనుకున్నాను" అంది.

వాళ్ళు మాటాడుకోడం విన్న స్వయంప్రభ ఆ మర్నాటినించీ నర్సిరెడ్డిని "పెద్దన్నయ్యా" అని, రవణని "పెద్దవదినా" అని "రెండో అన్నయ్యా రెండోవదినా" అని ఇలా వరసలు పెట్టి పిలుస్తుంటే పోయిన రామలక్ష్మి వాళ్ళ ముందు బాసిం పట్టు వేసుకు కూర్చున్నట్టే అయిపోయాయి వాళ్ళ మనసులు. ఒక్కసారిగా బోరుమని ఏడ్చేసేరు.

ప్రొడక్షన్ వాళ్ల మెస్ నించి వచ్చే భోజనం వద్దని చెప్పి స్వయంప్రభకోసం రోజుకోరకమైన వంట చేస్తుంటే తింటూ తన సొంత విషయాలు చెప్పటం మొదలెట్టింది. చిత్తూరు జిల్లాలో పలమనీరు ఏరియాలో ఉన్న సోమల అనే ఊరు వాళ్ళ సొంత ఊరట. చిన్నప్పట్నించీ డాన్స్ నేర్చుకుంటా బాలతారగా సినిమాల్లోకి ఎంటరయిందట. వాళ్ళింట్లో వాళ్ళ కజిన్‌సిస్టర్ ఒకమ్మాయి వుందట. ఆమె అంటే ప్రాణం అట తనకి. సేలం సంబంధమేదో కుదిరిందట. తొందర్లోనే ఆ పిల్ల పెళ్ళి "మీరంతా వచ్చి జరిపించకపోతే నా మీద ఒట్టే" అంది.

రేపు షూటింగ్ ప్రోగ్రాం చెప్పటానికి ఆరోజు సాయంత్రం స్వయంప్రభ దగ్గరకొచ్చిన మాణిక్‌రావు నర్సిరెడ్డిని కూడా కలిసి "ఇక నాలుగురోజుల్లో షూటింగ్ అయిపోతుంది అంతా వెళ్ళిపోతాం" అని చెప్పాడు.

అంతే, ఇంటిల్లపాదీ బెంగ పెట్టేసుకోవడం మొదలుపెట్టారు. వాళ్ళింటి ఆడపడుచు రామలక్ష్మి ఎటో వెళ్ళిపోతుందన్న దిగులు.

వెళ్ళడం ఎలాగూ తప్పదు ఒక నెలరోజుల తర్వాత వెళితే అన్న ఆలోచన. అదే స్వయంప్రభతో అంటే బాధగా నవ్వేసి ''వెళ్ళిన వెంటనే వేరే కంపెనీ సాంగ్స్ కోసం ఊటీ వెళ్ళాలి. అయినా వీలయినప్పుడల్లా ఫోన్ చేస్తుంటాను గదా'' అంది.

''ఫోన్ చెయ్యడం గాదు మా ఊరొచ్చెయ్యాలి'' అంది విజయలక్ష్మి.

అనుకున్నట్టే నాలుగురోజులు గడిచిపోయాయి.

సర్కార్‌కి టూటైర్ ఏసి టిక్కెట్లు పట్టుకొచ్చేసిన మాణిక్‌రావు ఏసికారు ఇంటి ముందు పెట్టేశాడు.

రామచంద్రపురం మంత్రవాదోళ్ళ బట్టలకొట్లో కెళ్ళి పట్టుచీర కొనుక్కొచ్చింది రవణ.

ఆ చీరా, పూలు, కుంకుమ సన్నటి బంగారు గొలుసూ, కారెక్కుతున్న స్వయంప్రభ చేతిలో పెట్టారు. వాటిని గుండెల కద్దుకున్న స్వయంప్రభ బోరుమని ఏడ్చేసి అందర్నీ కౌగిలించేసుకుంది. ఈలోపల కారేసుకొచ్చిన మాణిక్‌రావు ''ట్రైన్ షార్ప్ టైమ్‌కి బయల్దేరుతుంది మేడం'' అన్నాడు. తననెవరో బలవంతంగా తీసుకెళ్తున్నట్టు అది తనకస్సలు ఇష్టం లేనట్టు కారెక్కింది స్వయంప్రభ.

భారంగా కదిలిన కారు ఎర్రకంకర దుమ్ము లేపుకుంటా కదిలింది.

దుఃఖంలో మునిగిపోయిన నర్సిరెడ్డిగారింట్లో వాళ్ళెవరూ ఆ రాత్రి అన్నాలు తిన్లేదు.

వారమయ్యింది.

రెండు వారాలయ్యేయి.

నెలయ్యింది.

మూడు నెలలయ్యినియ్యి.

స్వయంప్రభ దగ్గర్నుంచి ఫోనుగానీ ఉత్తరంగానీ రాలేదు.

ఆ సాయంత్రం స్వయంప్రభ ఇచ్చిన వాళ్ళ ఇంటినెంబర్‌కు ఫోన్ చేశాడు లచ్చారెడ్డి, అటు పక్క ఫోనెత్తిన తమిళం మనిషి లైన్లో ఉండమని వెళ్ళాడు. పావుగంటయింది ఎవరూ లిఫ్ట్ చెయ్యలేదు. ఫోన్ పెట్టేసిన లక్ష్మారెడ్డి జరిగింది చెప్పాడు.

ఎవళ్ళకి అనిపించినట్టు వాళ్ళనుకున్నారు.

''మన దగ్గరున్నంత సేపూ మనమాటేమో'' అన్నాడు గవర్రెడ్డి.

''అసలా సినిమా వాళ్ళని ఎవరు నమ్మమన్నారు'' అన్నాడు లచ్చారెడ్డి.

అంతా వింటున్న నర్సిరెడ్డి ఒక్కముక్కా అన్లేదు.

మర్నాడు కాకివీర్రాజు గారింట్లో పెళ్ళికని వెళ్ళినపుడు కల్సిన చక్రాలూ ''మా సినిమాకి డేట్స్ ఇచ్చింది స్వయంప్రభ తెల్సా?'' అన్నాడు.

''ఇస్తే ఇచ్చిందిగానీ రాత్రి తమ్ముడు ఫోన్ చేస్తే జవాబే ఇవ్వలేదంటయ్యా'' అన్నాడు నర్సిరెడ్డి.

''మీకు తెలీదా వచ్చేనెల పదిహేనో తారీఖున వాళ్ళ కజిన్ పెళ్ళి అన్నీ స్వయంప్రభ మేడమే చూసుకోవాలి'' అన్నాడు.

ఈవార్త ఇంటికి మోసుకుని అందరికీ చెప్పాడు. ఆ పెళ్ళి గురించి స్వయంప్రభ ముందే చెప్పింది. అవును మనమే పొరపాటుబడ్డాం

అనుకున్నారు. ఆ పిల్లని అనవసరంగా తిట్టుకున్నాం అని బాధపడింది తెలుకుల రవణ.

పదిహేనో తేదీ అంటే ఇకవారం రోజులేవుంది.

పసుపుకొమ్ములు తెప్పించి స్వయంగా దంచి బిందెల్లో సర్దుతుంది రవణ. తాపేశ్వరం మడతకాజాలు, కాకినాడ కోటయ్య గొట్టం కాజాలు, పోకుండలూ, పాలకాయలు, తొక్కుడు లడ్డులూ పురమాయించి సరిగ్గా పద్నాలుగున సర్కారు ఎక్కే టైముకి మాకు తాజాగా అందజెయ్యాలన్నారు. గవరారెడ్డి అత్తోరు ఊబలంక. వాళ్ళకి లంకల్లో పదెకరాల అరిటితోటుంది. పనిగట్టుకుని ఆవూరెళ్ళిన గవరారెడ్డి దగ్గరుండి ఇరవై కట్టల అరిటాకులు కోయించి తీసుకొచ్చేడు.

ఇంటిల్లపాదీ పద్దాలుగున సర్కారుకి బయల్దేరారు.

బ్రేక్‌వేన్‌లో వేసిన అరిటాకులు ఎక్కడ ఎండిపోతాయో అని నాలుగ్గంటలకొకసారి స్టేషన్లలో ఆగి అక్కడున్నోళ్ళకి లంచాలిచ్చి బ్రేక్ వేన్‌లో కెళ్ళి కట్టలన్నీ విప్పి నీళ్ళు జల్లటం మొదలెట్టింది రవణ.

తెల్లవారింది. సర్కారెక్స్‌ప్రెస్ మద్రాసు వచ్చింది.

దోచుకునే ఆటోల వాళ్ళ వలలో చిక్కుకుని ఆళ్వార్‌పేటలో వున్న స్వయంప్రభ ఇంటి ముందుకొచ్చేరు. ఇంటి ముందు పెళ్ళి జనం అంతా తమిళంలో మాటాడుకుంటున్నారు.

గేటు దగ్గర గుర్కా ''ఎవరూ?'' అంటే ''స్వయంప్రభకి చెప్పు, పసలపూడినించి మీ అన్నయ్యలు వచ్చారని'' అన్నాడు నర్సిరెడ్డి.

లోపల్నుంచి వచ్చిన ఇంకో మనిషి ఆ సామాన్లేంటి అన్నట్టు చూస్తే చెప్పారు.

మరో ఇద్దర్ని పిలిచి సామాన్లన్నీ లోపల పెట్టించాడు తప్ప వీళ్ళని లోపలికి రమ్మన్లేదు.

తొమ్మిదయింది.

పదయింది.

ఈలోగా గేటు దగ్గర మూగిన స్వయంప్రభ ఫాన్సోళ్ళని కంట్రోలు చెయ్యలేక అవస్థ పడ్తున్నాడు గూర్ఖా.

మేకప్‌తో బయటికొచ్చిన స్వయంప్రభ అందరితో పాటు వచ్చి రెడ్డి కుటుంబానికి కూడా నవ్వుతా నమస్కరించి కారెక్కింది.

వెళ్ళిపోతున్న కారు వేపే మతులు పోయినట్టు చూస్తుండిపోయేరు నర్సిరెడ్డి కుటుంబీకులు.

నడుచుకుంటూ ముందుకువెళ్తున్న వాళ్ళకి తెనాంపేట జంక్షన్‌లో ''నమస్కారం రెడ్డిగారూ అన్నమాట'' వినిపించింది.

చూస్తే, ఆనాడు పసలపూడి షూటింగ్ కొచ్చిన మేకప్ కుర్రోడు వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళి భోజనం పెట్టి ''మీ వూరు షూటింగ్ కొచ్చినప్పుడు మీ ఇంటిల్లపాదీ మా యూనిట్‌కిచ్చిన గౌరవం, మా హీరోయిన్‌కిచ్చిన ఆతిథ్యం మేమెలా మర్చిపోగలం చెప్పండి''అన్నాడు.

* * *